క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అంబాజీపేట: ఈనెల 27న జరగనున్న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 2460 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్థానిక జెడ్పీ హైస్కూల్లో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

వాడపల్లి వెంకన్నకు లక్షతులసి పూజ



లక్ష తులసిపూజ నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారికి మంగళవారం దేవస్థానం ఆధ్వర్యంలో లక్షతులసి పూజ నిర్వహించారు. మాఘమాసంలో స్వామి వారి వార్షిక పూజల్లో భాగంగా దేవదాయ–ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకలు, వేదపండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ వివిధ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏడు వారాలు పూర్తి చేసుకున్న భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి శ్రీనివాస కార్ పార్కింగ్ నందు అభివృద్ధి పనులను, కోనేరు నిర్మాణ పనులను డీసీ అండ్ ఈఓ చక్రధరరావు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

విజయేంద్ర సరస్వతి జన్మదినం



ముక్కామలలో విజయేంద్ర సరస్వతికి స్వరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

అంబాజీపేట: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ పుట్టినరోజును పురస్కరించుకుని ముక్కామలలో పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాదస్వర, డోలు పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజయేంద్ర సరస్వతి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి, విద్యార్థులు తమ నాద స్వరాలతో స్వామికి స్వరాభిషేకం చేశారు. నాదస్వర, డోలు పాఠశాల అభివృద్ధికి వెన్నంటి ఉంటూ సహాయ సహకారాలు అందిస్తున్న సంప్రదాయ పాఠశాల కో ఆర్డినేటర్ లక్ష్మి మందాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్ఎన్ సోమయాజులు, నాదస్వర, డోలు గురువులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎంపీడీఓ మల్లికార్జునరావుతో కార్యదర్శులు

మలికిపురం: చెత్త నుంచి సంపద సృష్టించాలని ఎంపీడీఓ జి.మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని మేడిచర్లపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి అధ్యక్షతన జరిగిన అవగాహనలో ఆయన పాల్గొని మాట్లాడుతూ చెత్త నుంచి సంపద ఏ విధంగా తయారు చేయాలి. ప్లాస్టిక్ వాడకం ఏ విధంగా తగ్గించాలి అనే అంశాలపై వివరించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరూ హాజరు కాగా అవగాహన కల్పించారు. తడి–పొడి చెత్త ఏ విధంగా వేరు చేయాలో వివరించారు. గ్రామ కార్యదర్శి బొంతు శ్రీహరి, మండలంలోని కార్యదర్శులతో పాటు ఎంపీటీసీలు ముత్యాల సాయిరాం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం



భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో మంగళవారం మామిడికుదురుకు చెందిన త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం సభ్యులు నిర్వహించారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటా ఈ ప్రచారం చేశారు. కమిటీ సభ్యులు హనుమంతురావు, జగదీష్, అన్నపూర్ణ, సత్యవతి, బ్రహ్మాజీ, సుబ్బారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



కొత్తపేట సచివాలయం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్



కొత్తపేట మండల పరిషత్ కార్యాలయంలో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

- కొత్తపేట రెవెన్యూ డివిజన్లో 18,698 మంది ఓటర్లు
- 27 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

కొత్తపేట: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. కొత్తపేట రెవెన్యూ డివిజన్లో ఆర్డీఓ పి.శ్రీకర్ ఆధ్వర్యంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 7 మండలాల్లో పురుషులు 10,859 మంది, స్త్రీలు 7,838 మంది, థర్డ్ జండర్ ఒకరితో మొత్తం 18,698 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పోలింగ్‌కు అనువుగా అన్ని సౌకర్యాలతో సిద్ధం చేశారు.

- కొత్తపేట నియోజకవర్గంలోని 4 మండలాల్లో 17, పి.గన్నవరం నియోజకవర్గంలోని 3 మండలాల్లో 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఓట్ల వేటలో నేతలు

పోటీలో ఉన్న అభ్యర్థుల విజయం కోసం నేతలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. గ్రామాల్లోని పట్టభద్రులను కలసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నాయకులు ప్రచారం చేస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ప్రధానంగా అధికార కూటమి, పీడీఎఫ్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. కూటమి అభ్యర్థికి మద్దతుగా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఉభయగోదావరి జిల్లాల టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార బలం, ఆర్థిక బలం అభ్యర్థులను పీడీఎఫ్ అభ్యర్థులు ఓడించి శాసనమండలిలో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఈసారి ఎలాగైనా గెలవాలని కూటమి పాలకులు స్థానిక నాయకులను ఆదేశించారు. దాంతో స్థానిక కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తరహాలో ఇంటింటా ప్రచారం సాగించారు. దూర ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులను వారి స్వగ్రామాలకు రప్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి ఏమాత్రం తీసిపోని రీతిలో పీడీఎఫ్ అభ్యర్థి తరఫున యూటీఎఫ్ నాయకులు ఓట్లు అభ్యర్థించారు. వారికి ఓటర్లు స్వచ్ఛందంగా మద్దతు తెలియజేస్తున్నారు. అలాగే పలువురు అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు.

మండలాల వారీగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు

మండలం	పీఎస్‌లు	పురుషులు	స్త్రీలు	మొత్తం ఓటర్లు
కొత్తపేట	6	2,270	1,639	3,909
రావులపాలెం	5	2,089	1,611	3,700
ఆత్రేయపురం	3	954	647	1,601
ఆలమూరు	3	1,272	687	1,959
అయినవిల్లి	3	1,463	1,051	2,514
పి.గన్నవరం	4	1,443	1,139	2,582
అంబాజీపేట	3	1,368	1,064	2,432
మొత్తం	27	10,859	7,838	18,697

వాహనాల వేలంతో రూ.97 వేల ఆదాయం

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్ చేసిన ఆరు ద్విచక్ర వాహనాలకు నిర్వహించిన వేలంలో రూ.97 వేల ఆదాయం లభించింది. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేవీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు, ఎస్సై రాంబాబు పర్యవేక్షణలో ఎక్సైజ్ సిబ్బంది ఆరు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించారు. వాహనాల వేలం ద్వారా రూ.85 వేలు, జీఎస్టీతో మరో రూ.12 వేలు చెల్లించి వేలంలో దక్కించుకున్న వాహనాలను తీసుకువెళ్లాలని సీఐ నాగేశ్వరరావు మంగళవారం సూచించారు.

పంట కాలువల్లో చెత్త వేయవద్దు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల వెంబడి ప్రవహిస్తున్న పంట కాలువల్లో చెత్తతో కూడిన వ్యర్థాలు వేయవద్దని చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు కోరారు. తూర్పు డెల్టా ప్రధాన కాలువ నుంచి జొన్నాడ మీదుగా ప్రవహించే జొన్నాడ, ఆలమూరు, చింతలూరు, వెదురుమూడి కాలువలను మంగళవారం ఆయన పరిశీలించారు. వ్యర్థాలతో నిండిపోవడం వల్ల పంట కాలువల నుంచి దిగువకు సక్రమంగా సాగునీరు అందడం లేదన్నారు. దీనిపై సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు.

వైభవంగా ఉమామహేశ్వరుల కల్యాణం



మందపల్లిలో ఉమామహేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



అంతర్వేదిలో స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మలికిపురంలో స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

కొత్తపేట: మందపల్లి గ్రామంలో వేంచేసిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి, ఉమా బ్రహ్మేశ్వరస్వామి, ఉమా నాగేశ్వరస్వామి వార్ల వార్షిక కల్యాణ మహోత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శనైశ్చరుడు ప్రతిష్ఠించిన శివలింగం కావడంతో దేశవ్యాప్తంగా శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన శనైశ్చర క్షేత్రంగా ఈ మందపల్లి క్షేత్రం విరాజిల్లుతున్న విషయం తెలిసిందే. వివిధ శనిదోష నివారణ పరిహారార్థం ప్రతీ శనివారంతో పాటు శనిత్రయోదశి పర్వదినాల్లో దేశం నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహిస్తారు. అలాగే ఇదే క్షేత్రంలో ఉమా బ్రహ్మేశ్వరస్వామి, ఉమా నాగేశ్వర స్వామి వార్ల ఆలయాలు ఉన్నాయి. దేవదాయ–ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు పెళ్లి పెద్దలుగా కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. దేవస్థానం తరఫున అధికారులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని ప్రదానం నుంచి తలంబ్రాల వరకూ ఆద్యంతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి ఘట్టం కనుల వైకుంఠాన్ని తలపించడంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగి తన్మయత్వం చెందారు. అనంతరం భక్తులకు కల్యాణ తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీటీసీ సభ్యుడు సిద్దంశెట్టి వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం, విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన అర్చకులు ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం సిబ్బంది స్వామి మూలవిరాట్టు దర్శనం, అన్నదానంలో భోజన సౌకర్యం కల్పించింది.

మలికిపురంలో..

మలికిపురం: స్థానిక లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఖండవల్లి సూర్య సత్యనారాయణాచార్యులు, పెద్దింటి సాయిలక్ష్మణ రవికిరణ్ ఆచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. కల్యాణం అనంతరం శ్రీపుష్పోత్సవం, పవళింపు సేవలు నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఆలయ అభివృద్ధి చైర్మన్ కునాథరాజు చంటిరాజు, సుబ్బలక్ష్మి, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సైన్స్ ప్రదర్శన



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మలికిపురం: విశ్వేశ్వరాయపురంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో చిన్నారులు విశేష ప్రతిభ కనబచారు. ఎంఈవో ఎం.విజయశ్రీ పాల్గొని మాట్లాడుతూ చిన్నారుల్లో ఉన్న సృజనాత్మక ఆలోచనలు వెలికితీసేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని అన్నారు. పిల్లలను ఏటా ఈ విధంగా ప్రోత్సహిస్తున్న పాఠశాలను అభినందించారు. విశ్వేశ్వరాయపురం ఎంపీటీసీలు గుబ్బల సత్యనారాయణ, ఎంఈవోలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సుమారు 170 నమూనాలు ప్రదర్శించారు, కార్యక్రమంలో మలికిపురం ఎస్సై సురేష్, సోషల్ వర్కర్ బోనం రాజు, తాడి సహదేవ్, పి.గణేష్, దేవ వరప్రసాద్, నల్లి శివ, గెడ్డం ఫిలిప్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి శివారు చింతావారిపేటలో ఈ నెల 20న కప్పల ఏడుకొండలు ఇంట్లో 46 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీనిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. ఇంటికి తాళాలు వేసి ఏడుకొండలు తన బంధువుల ఇంటికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు బాధితుడు గుర్తించాడు. దీనిపై ఏడుకొండలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించం

రాజోలు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించమని పలువురు దళిత సంఘ నాయకులు అన్నారు. మంగళవారం రాజోలు సీఐ నరేష్‌కుమార్‌కు సోషల్ మీడియా ద్వారా అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ పోస్టులు పెడుతున్న వారిపై ఫిర్యాదు చేశారు. దుబాయ్, కువైట్ కేంద్రాలుగా చేసుకుని కొందరు టిక్‌టాక్‌లో దళితులు, అంబేడ్కర్‌పైన వ్యంగ్యంగా అవమానిస్తూ పోస్టులు పెడుతున్నారని, ఆ వీడియోల ద్వారా ఫోన్ నంబర్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు నేడు సెలవు

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన మండలంలోని మడికిలోని అభయాంజనేయస్వామి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కమిటీ తెలిపింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సెలవును ప్రకటించిన కారణంగా కూరగాయల కొనుగోలు, విక్రయాలు జరగవన్నారు. కావున సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు గమనించి కూరగాయల కొనుగోలును వాయిదా వేసుకోవాలని సూచించారు. ఏటా మాదిరిగానే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక మార్కెట్ ఆవరణలో భారీ అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

28న క్రీడా పోటీలు

అయినవిల్లి: ఈనెల 28న జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర వర్క్‌షాప్, క్రీడా పోటీలు నిర్వహిస్తారని డీఈవో ఎస్కే సలీంబాషా మంగళవారం నాడొక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్తంగా జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారన్నారు.

ముగ్గురిపై ఈవ్‌టీజింగ్ కేసు

అయినవిల్లి: ముక్తేశ్వరంలో ఓ యువతిని ఈవ్‌టీజింగ్ చేస్తున్న ముగ్గురు యువకులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.మనోహరజోషి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అయినవిల్లి పెదపాలెంకు చెందిన ఓ యువతిని ముక్తేశ్వరం ఎస్‌బీఐ బ్యాంకు వద్ద కొత్తపేట మండలం బిళ్లకుర్రు గ్రామానికి చెందిన గోగి అనిల్ మరో ఇద్దరు బైక్‌పై వచ్చి ఈవ్‌టీజింగ్ చేశారు. వీరిపై యువతీ నాగపద్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ



పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కేవీ ప్రసాద్

పి.గన్నవరం: మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ కె.విజయప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాల్లో తెలుసుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నేర్పించాలని సూచించారు. ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రానందం, హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

కొత్తపేట: ‘జ్ఞానజ్యోతి’ పేరిట పొందిన శిక్షణ ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి దోహదపడాలని ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి అన్నారు. ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్ర శిక్షా మహిళా అభివృద్ధి చైల్డ్ వెల్ఫేర్ సంయుక్తంగా ఈ నెల 18 నుంచి ఆరు రోజుల పాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. మండలంలో 78 అంగన్‌వాడీ సెంటర్స్ నుంచి 62 మంది కార్యకర్తలు శిక్షణ పొందారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శివరాత్రి చిత్రం



సంగీత్ గీసిన శివుని వాటర్ పెయింట్

మలికిపురం: శివరాత్రి నేపథ్యంలో మలికిపురం సునయన ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్, చిత్రకారుడు నల్లి సంగీత్ గీసిన వాటర్ పెయింట్ చిత్రం విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం తన అకాడమీ విద్యార్థులు ఆ చిత్రాన్ని ప్రదర్శించారు.

మహా శివరాత్రికి శైవక్షేత్రాల ముస్తాబు



పెదపట్నంలో కొలువుదీరిన ఉమామూలేశ్వరస్వామి



అప్పనపల్లిలో కరెన్సీతో తయారు చేసిన శివలింగం



అప్పనపల్లిలో పుష్పాలతో రూపొందించిన శివలింగం



పెనికేరులో కొలువైన స్వయంభూ ఇష్టకాంతేశ్వరస్వామి



జొన్నాడలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి

అంబాజీపేట: మహాశివరాత్రిని పురస్కరించుకుని శైవక్షేత్రాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో పలు చోట్ల భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలకు రంగులతోను, విద్యుత్ దీపాలంకరణలతో అలంకరిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు.

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపం మూలేశ్వరస్వామి

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరం పెదపట్నంలో కొలువుదీరిన ఉమా మూలేశ్వర స్వామి యోగ లింగాకారుడు. ఈ శివలింగంపై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపం సాక్షాత్కరిస్తుంది. ఈ ఆలయంలో శివుడి విగ్రహం ఎనిమిది అడుగులు ఎత్తులో ఉంటుంది. ఈ ఆలయంలో శివుడు యోగ లింగాకారుడిగా తపస్సులో ఉండడం వల్ల ఇక్కడ శివునికి మిగిలిన ఆలయాల మాదిరిగా కల్యాణం నిర్వహించరు. మూలేశ్వరస్వామిని దర్శించుకోవడం ద్వారా కోరిన కోర్కెలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం. ఎంతో మహిమాన్వితునిగా మూలేశ్వర స్వామి భక్తుల పూజలందుకుంటున్నారు.

ఈ ఆలయం ఎంతో పురాతనమైంది. దీనికి శతాబ్దాల చరిత్ర ఉంది. చోళ రాజుల కాలంలో అరణ్యంగా ఉన్న ఈ ప్రాంతంలో రాజు వేటకు వచ్చాడని, పొదల్లో కుందేలుగా భావించి దానిని సంహరించేందుకు బాణం సంధించాడని చెబుతారు. ఇలా విడిచిన మూడు బాణాలు కుందేలుగా భావించిన శివలింగానికి గుచ్చుకున్నాయని ఇప్పటికీ ఆ గుర్తులు శివలింగంపై దర్శనమిస్తున్నాయని చరిత్రకారులు పేర్కొంటున్నారు. శివలింగాన్ని గుర్తించిన ప్రాంతంలో చోళ రాజులు ఈ ఆలయాన్ని నిర్మించారనే కథనం వాడుకలో ఉంది. శివరాత్రికి ఈ ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

ఆకట్టుకుంటున్న శివలింగాలు

మామిడికుదురు: మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పనపల్లి, మొగలికుదురు, పాశర్లపూడిబాడవ తదితర గ్రామాల్లో మహా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. వివిధ రకాల సెట్టింగులతో పాటు భక్తులను విశేషంగా ఆకట్టుకునే విధంగా శివలింగాలను ఏర్పాటు చేస్తారు. అప్పనపల్లి, మొగలికుదురు గ్రామాల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

అప్పనపల్లి మైనరురాజుగారి వీధిలో శ్రీబాల గణపతి మిత్ర బృందం, సంతపేటలో జై గౌరీ శంకర భక్త బృందం ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. మైనరురాజుగారి వీధిలో పలు రకాల పుష్పాలు, కరెన్సీ నోట్లతో తయారు చేసిన శివలింగాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటిని మంగళవారం స్థానికంగా ప్రదర్శించారు.

మహోత్సవాలకు సర్వం సిద్ధం



ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయ వద్ద భక్తుల జల్లు స్నానాలకు చేసిన ఏర్పాట్లు

అయినవిల్లి: మండలంలోని పలు శివాలయాల్లో శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముక్తేశ్వరంలోని ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా బారికేడ్లు నిర్మించారు. స్వామిని దర్శించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు నిర్మించారు. విద్యుత్ దీపాంకరణతో ఆలయం స్వర్ణ శోభను సంతరించుకుంది. ముక్తేశ్వరం వృద్ధగౌతమి స్నానఘాట్ వద్ద నదీలో నీటిమట్టం పెంచేందుకు అయినవిల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో ఇంజిన్ల సాయంతో నీటిని తోడిస్తున్నారు. స్నానఘాట్ వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు జల్లు స్నానాల కోసం ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేశారు. స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు వీలుగా టెంట్లు నిర్మించి అడ్డుగా క్లాత్‌లను ఏర్పాటు చేశారు. పిండ ప్రదానాలు, మూసివాయనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

అయినవిల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, వీరవల్లిపాలెం వీరేశ్వరస్వామిస్వామి, సిరిపల్లి కనకేశ్వర స్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, శానపల్లిలంక చొడేశ్వర స్వామి, మాగాం, విలస, మడుపల్లి, వెలవలపల్లి, తొత్తరమూడి గ్రామాలోని శివాలయాల్లో శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.